శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త



## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, నవంబరు 10, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 9848.87 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 71.747 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టాకు 2650 , కండలేరు వరద కాలువకు560 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.759 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# జాతీయ స్థాయిలో నెల్లూరు జిల్లాకు అరుదైన గౌరవం

- నీటి సంరక్షణలో నెల్లూరు జిల్లాకుజల్ సంచయ్ జన్ భగీదారి 1.0 జాతీయ అవార్డు
- నవంబర్ 18న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డ్ అందుకోనున్న జిల్లా కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 11, ప్రభాతవార్త** నీటి సంరక్షణ కార్యక్రమాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు దేశ స్థాయిలో జల్ సంచయ్ జన్ భగీదారి 1.0 నేషనల్ అవార్డు లభించింది. నవంబర్ 18న న్యూ ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఈ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు ప్రదానం చేయనున్నారని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను కలిసి పుష్ప గుచ్ఛం అందించి పీడి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డ్వామా పీడి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో నెల్లూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం క్రింద ఫారం పాండ్లు 856, ఇంకుడు గుంటలు 3,495,ఊట చెరువులు 112, చెక్ డ్యామ్‌లు 166, డగౌట్ పాండ్లు/వాటర్ హార్వెస్టింగ్ పాండ్లు 512, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు 54, రింగ్ ట్రెంచులు 12,/సరిహద్దు కందకాలు 34, నీటి నిల్వ కందకాలు 14, చెరువుల పూడికతీత పనులు 247, మొత్తం 5,502 భూగర్భ జలాల రీఛార్జ్ పనులు చేపట్టడం ద్వారా ఈ అవార్డును సాధించగలిగామని ఆమె వివరించారు. జల్ సంచయ్ జన్ భగీదారి అంటే ప్రభుత్వ యంత్రాంగం సమిష్టిగా పనిచేసి ప్రతి నీటి చుక్కను సంరక్షించడం, భవిష్యత్తు తరాల కోసం నీటి భద్రతను కాపాడడానికి నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం. ఈ కార్యక్రమం ద్వారా వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్, నీటి కొరత నివారణ, ప్రజల్లో నీటి ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడం జరిగిందన్నారు. ఈ విజయానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఇచ్చిన అమూల్య సూచనలు పాటిస్తూ, ఉపాధి హామీ సిబ్బంది, ప్రజల సమిష్టి కృషితో సాధించామని పీడి గంగాభవాని ఆ ప్రకటనలో తెలిపారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



**కందుకూరు నవంబరు 11, ప్రభాతవార్త** కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం లింగనపాలెంలో ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు స్వాగతం పలికారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేస్తున్న ఈ పార్కుల ద్వారా నిరుద్యోగ యువతకు ఎంతో మేలు జరుగుతుందన్నారు, త్వరలో కందుకూరు నియోజకవర్గంలో సైతం ఇలాంటి పార్కు ఏర్పాటు కాబోతుందని ఎమ్మెల్యే తెలిపారు.

## రైల్వే గేట్ల అండర్ బ్రిడ్జి ల నిర్మాణాల పై రూరల్ ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష



**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 11, ప్రభాతవార్త:** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ మంగళవారం కొండాయపాలెం, వేదాయ పాలెం రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జి ల నిర్మాణం కోసం డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ పీ.వీ. రమణ రావు, మున్సిపల్ కమిషనర్ వై ఓ నందన్, ఆర్డీవో ఎన్.అనూష మున్సిపల్, రెవెన్యూ, ఎలక్ట్రికల్ శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశంలో పాల్గొన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి , టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.

## మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కి ఘన నివాళులు



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 11, ప్రభాతవార్త:** జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్యనంతరం దేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమర యోధుడని, దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన వ్యక్తి అని కొనియాడారు. స్వాతంత్రం ఏర్పడిన అనంతరం మొదటి ప్రభుత్వంలో సుదీర్ఘంగా 11 సంవత్సరాల పాటు విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని, ఆయన జన్మదినాన్ని జాతీయ ఎడ్యుకేషనల్ డేగా జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ డిఎస్పి, అడ్మిన్ ఆర్ ఐ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా వీపీఆర్

- 5లక్షల చెక్కు అందజేసిన వీపీఆర్ సిబ్బంది



**వింజమూరు, నవంబర్ 11, ప్రభాతవార్త** కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనలో బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ప్రమాదం రోజున బాధిత కుటుంబానికి హామీ ఇచ్చిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు. మంగళవారం వీపీఆర్ సిబ్బంది శంకర్, రమేష్, వింజమూరు మండలం చాగలకొండ పంచాయతీ పరిధిలోని గొల్లవారిపల్లెకు విచ్చేసి గోళ్ళ రమేష్ తండ్రి మాలకొండయ్య తల్లి సుశీలమ్మకు ఐదు లక్షల రూపాయలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి మనోధైర్యం అందించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటారని వారు తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లో నైనా ఆ కుటుంబానికి తప్పకుండా సహాయం అందించేందుకు ముందుంటానని వెల్లడించారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సహాయం అందించారని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారానికి ఎంపీడీవో కృషి



**నెల్లూరు అగ్రికల్చర్, నవంబర్ 11, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ మండల పరిధిలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన అర్జీలపై రూరల్ మండల ఎంపీడీవో ఎంవీ రమణమ్మ స్పందించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశానుసారం మంగళవారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కొమ్మరపూడిలో ఇంటి స్థలం వివాదమై ఆ గ్రామానికి విచ్చేసి ఇరు వర్గాలతో చర్చించారు. గ్రామంలో కొంత మంది అక్రమ సంపాదనకు అలవాటు పడి అధికారుల విలువైన సమయాన్ని వృధా చేస్తున్నారు. ఈ సమస్యపై దాదాపు ఒకటిన్నర గంటపాటు ఇరు వర్గాలతో చర్చించి, 15 రోజుల్లో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి ఇంటి పన్ను వసూళ్లు చేస్తున్న రికార్డులను పరిశీలించారు. రికార్డులు అస్తవ్యస్తంగా ఉండడంతో కొంత అసంతృప్తి చెందారు. అనంతరం కందమూరు, వెల్లంటి ప్రాంతాల్లో పర్యటించారు.

# పరిశ్రమల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు

- పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నాం
- రామదాసుకండ్రిగలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుతో యువతకు ఉద్యోగాలు
- సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
- డిసెంబరు లేదా జనవరిలో జిల్లా స్థాయి పరిశ్రమల సదస్సు
- త్వరలోనే బీపీసీఎల్ పెట్రోలియం రిఫైనరీ ఏర్పాటుకు భూమి పూజ
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 11, ప్రభత వార్త** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి సీఎం చంద్రబాబు నాయుడు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి బిట్2 రామదాసుకండ్రిగ వద్ద ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కు (పారిశ్రామికవాడ)కు, మర్రిపాడు మండలం పొంగూరు వద్ద ఏర్పాటు చేయనున్న స్నేహ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు భూమి పూజ శిలాఫలకాలను వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, పలువురు పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి బిట్2 రామదాసుకండ్రిగలో 57.50 ఎకరాలలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మొదటివిడత 20 ఎకరాల్లో 5.50 కోట్లతో ఈ పార్కులో రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ పార్కు వలన సుమారు ఐదువేల మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. కృష్ణపోర్టు, రామాయపట్నం పోర్టు, జాతీయ రహదారులు వంటి అపారమైన అవకాశాలతో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం జిల్లాలో ఉందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని కంటేపల్లిలో 220 ఎకరాలు, బండేపల్లి, మడమనూరులో 150 ఎకరాల ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహాలు అందిస్తూ, సింగిల్‌విండో విధానం అన్ని అనుమతులు సకాలంలో మంజూరు చేసేలా సీఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కృష్ణపట్నం పోర్టుకు సమీపంలో గతంలో సేకరించిన 2600 ఎకరాల భూమి ఖాళీగా వుందని, సీఎం దృష్టికి తీసుకెళ్లి ఈ భూములను కూడా పరిశ్రమల ఏర్పాటుకు వినియోగించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

**జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్ల మాట్లాడుతూ**

ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వం లక్ష్యం కాగా, జిల్లాలో ఇప్పటికే 4 ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభం కాగా, తాజాగా సర్వేపల్లిలో మరో ఎంఎస్ఎంఈ పార్కుకు సీఎం శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. రామాయపట్నం పోర్టు సమీపంలో త్వరలో అతిపెద్ద పరిశ్రమ బిపిసిఎల్ పెట్రోలియం రిఫైనరీ ఏర్పాటుకు భూమి పూజ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ పరిశ్రమకు అనుబంధంగా అనేక పరిశ్రమలు ఏర్పాటుకానున్నట్లు చెప్పారు. అలాగే ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక వసతులను కల్పిస్తూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. జిల్లా స్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై డిసెంబరు లేదా జనవరిలో పారిశ్రామికవేత్తలతో జిల్లాస్థాయి పరిశ్రమల సదస్సును నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పారదర్శకంగా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. పారిశ్రామిక వేత్తలందరూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని, ప్రభుత్వం తరపున అన్నివిధాల పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శివకుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వమెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణం

- నేడు కావలిలో జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయండి



**కావలి, నవంబర్ 11, ప్రభాతవార్త:** పేద విద్యార్థులకు వైద్య విద్యను, పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం దారుణమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కావలి పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ఏర్పాటుచేసిన మెడికల్ కళాశాలలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తున్నందున దానికి నిరసనగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు నేడు కావలి పట్టణంలోని ఆర్ఎస్ఆర్ కళ్యాణమండపం వద్ద నుండి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు నిరసన ర్యాలీని చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు అనంతరం ఆర్డీవో కు వినతి పత్రాన్ని అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. గత వైసిపి పాలనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలను చేయించడం జరిగిందని దీనికి ఎనిమిది వేల కోట్ల రూపాయలను కేటాయించడం కూడా జరిగిందన్నారు. వాటిలో నాలుగు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరిగిందన్నారు. మిగిలిన నాలుగువేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే మెడికల్ కళాశాలలు అన్ని అందుబాటులోకి వస్తాయని తెలియజేశారు. వాటిల్లో ఏడు మెడికల్ కళాశాలను ప్రారంభించడం కూడా జరిగిందని తెలియజేశారు ఆరు మెడికల్ కళాశాలలో పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు ఏడు మెడికల్ కళాశాలకు పునాదులు వేసి పనులను కూడా ప్రారంభించడం జరిగిందని తెలియజేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారికి సంబంధించిన వారికి ధారా దత్తం చేయాలనే సంకల్పంతో ప్రైవేటీకరణను చేస్తున్నారని తెలియజేశారు దీనిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలియజేశారు. కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నందున పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు వైద్యం దూరం అవుతుందని దీనిని అడ్డుకునేందుకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమానికి కావలి నియోజకవర్గంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొనాలని జయప్రదం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పందిటి కామరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కనమర్లపూడి వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, జడ్పిటిసి సభ్యులు జంపాని రాఘవులు, నెల్లూరు వెంకటేశ్వర్లు రెడ్డి మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిపాలన కార్యదర్శి రెవెన్యూ వసూళ్లపై దృష్టి పెట్టాలి

- అదనపు అంతస్థులను పన్నులోకి తేవాలి
- కాళీ స్థలాలకు వి.ఎల్. టి పన్ను వేయాలి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 11, ప్రభాతవార్త:** నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ వారాంతపు సమీక్షా సమావేశంలో భాగంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారము రెవిన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, సమయానుకూలంగా పరిష్కరించాలని ఆదేశించారు. పై విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయం జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నందున, ఎటువంటి అలసత్వం పనికిరాదని హెచ్చరించారు.

- ప్రతి పరిపాలన కార్యదర్శి తమ సచివాలయ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు రెవిన్యూ వసూళ్లపై దృష్టి పెట్టాలని, అలాగే ఖాళీ స్థలాలను గుర్తించి పన్నులు విధించడంలో చురుకుగా వ్యవహరించాలని సూచించారు. కొత్తగా నిర్మించిన ఆస్తులు, అదనపు అంతస్తులు అపార్ట్మెంట్లకు వెంటనే పన్నులు విధించి ట్యాక్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. అర్జీదారులు అభ్యర్థించిన వివిధ సేవా అభ్యర్థనలను (సర్వీస్ రిక్వెస్ట్) నిర్ణీత సమయాల్లో పూర్తి చేయాలని సూచించారు. డిసెంబర్ నెలలో జరగనున్న నేషనల్ లోక్ అదాలత్లో 25,000కు పైబడిన బకాయిలు ఉన్నవారిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. గతంలో నోటీసులు అందుకొని లోక్ అదాలత్‌కు హాజరుకాని వారు లేదా హాజరై బకాయిలు చెల్లించని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవిన్యూ అధికారులు తమ పరిధిలో కనీసం 40 లక్షల రెవిన్యూ వసూళ్లు సాధించేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలకు పన్నులు విధించేందుకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది సహకారంతో లేఅవుట్లను గుర్తించాలని సూచించారు. ప్రతి రెవిన్యూ ఇన్స్పెక్టర్ తమ పరిధిలోని పరిపాలన కార్యదర్శులను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ పన్ను వసూళ్ల ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, టి.పి.ఆర్.ఓ. వాసు బాబు, రెవిన్యూ ఆఫీసర్లు సమద్, శ్రీనివాసులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ కార్యదర్శులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# చెన్నై : కోలకత్తా జాతీయ రహదారిపై కంటైనర్ లారీ బీభత్సం

- ముగ్గురు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు
- నెల్లూరు నగర సమీపంలో ప్రమాదం









**నెల్లూరు క్రైమ్, నవంబర్ 11, ప్రభాతవార్త:** నెల్లూరు నగర శివార్లలో చెన్నై కోలకతా 45వ నెంబర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనంతో పాటు సేకరించిన సమాచారం మేరకు చెన్నై వైపు నుండి కావలి వైపుగా వెళుతున్న చేపల కంటైనర్ లారీ నెల్లూరు ఎస్ వి జి ఎస్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తున్న ఒక మోటార్ సైకిల్ లిస్టును తప్పించే క్రమంలో ఆదే రహదారిపై వెళుతున్న మరో రెండు స్కూటర్లను ఢీ కొట్టింది. అతి వేగంగా రోడ్డు పక్కన మొక్కజొన్న కంకులు అమ్ముతున్న మంజుల, పక్కనే కొబ్బరి బొండాలు అమ్ముతున్న మాలకొండయ్యలను పైకి దూసుకెళ్ళింది. వారిద్దరితో పాటు అక్కడే కంకులను కొనుగోలు చేసేందుకు నిలబడి ఉన్న స్టోన్ హౌస్ పేట ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఎలక్ట్రికల్ ఉద్యోగి అనిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో స్కూటర్ పై వెళ్తున్న నగరంలోని సిరి గార్డెన్స్ ప్రాంతానికి చెందిన తండ్రి కొడుకులు షేక్ కాజా నజీమ్ మొహిదీన్ (70), షేక్ ముజాహిద్ అలీ (35), మరో బైక్ పై వెళుతున్న అదే ప్రాంతానికి చెందిన వై సురేష్ (35)లు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణంగా భావిస్తున్న కోటి అనే బైకర్ కు కూడా గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్ లు, ఒక టాటా ఏస్ ఆటో, చక్రాల బండి ధ్వంసమయ్యాయి.

**రోడ్డు క్రాస్ చేస్తున్న బైకర్ వల్లే ప్రమాదం?**

వెనక వచ్చే వాహనాలను పరిశీలించకుండా జాతీయ రహదారిపై జంక్షన్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న కోటి అనే బైకర్ వలన ప్రమాదం చోటు చేసుకున్నట్లు, అదే సమయంలో అతివేగంతో వస్తున్న లారీ డ్రైవర్ బైకర్ను తప్పించే క్రమంలో మిగతా వారిపై విచక్షణ రహితంగా దూసుకెళ్లిపోవడంతో ఇంతటి విధ్వంసం జరిగినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. రహదారి పక్కనే ఉన్న భారీ వృక్షం యొక్క కొమ్మలు విరిగిపోయాయి అంటే ప్రమాద తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు. ప్రమాద విషయం తెలియగానే సంఘటనా స్థలానికి చేరుకున్న డిటిసి డిఎస్పి గిరిధర్ పర్యవేక్షణలో నెల్లూరు నార్త్, సౌత్ ట్రాఫిక్ సిఐలు రామకృష్ణ, వెంకటరెడ్డి, బాలాజీ నగర్, నవాబుపేట సిఐలు సాంబశివరావు, వేణుగోపాల్ రెడ్డిలు మృదుల కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ఏర్పడిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

**బాధితులది ఒక్కొక్కరిది ఒక్కోగా!**

ఈ రోడ్డు ప్రమాదంలో మరణించిన తండ్రి కొడుకులు షేక్ కాజా నజీమ్ మొహిద్దిన్, షేక్ ముజ్జహీద్ అలీ కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. కావలి మున్సిపాలిటీలో పనిచేస్తున్న ముజాహిద్ తన తండ్రికి అనారోగ్యంగా ఉండడంతో ఆసుపత్రిలో చూపించుకుని ఇంటికి తీసుకుని వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తాము జాగ్రత్తగా వెళ్తున్నప్పటికీ ఎవరో చేసిన తప్పిదానికి ఈ తల్లి తండ్రి కొడుకులు మృతి చెందడం బాధాకరం. అలాగే పొట్టకూటి కోసం జాతీయ రహదారి పక్కన మొక్కజొన్న కంకులు, కొబ్బరి బొండాలు అమ్ముకుంటున్న మంజుల, మాల కొండయ్యలు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. నవాబుపేట పరిధిలో ఏపీఎస్పీడీసీఎల్ జూనియర్ లైన్ మాన్ గా పనిచేస్తున్న అనిల్ కుటుంబ సభ్యులకు కోసం మొక్కజొన్న కంకులు కొంటూ నిలబడి ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదానికి కారణంగా భావిస్తున్న బైకర్ కోటికి స్వల్ప గాయాలవ్వగా లారీ డ్రైవర్ పరారయ్యాడు.

## రెండు దుకాణాలు దగ్ధం:12 లక్షల ఆస్తినష్టం



**సీతారామపురం నవంబర్ 11 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామ సమీపాన గల జాతీయ రహదారి 167బి వద్ద ఉన్న రెండు దుకాణాలలో మంగళవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం ఉదయం షాపు తెరచిన కొద్ది సేపటి తరువాత కడుగు లక్ష్మయ్యకు చెందిన కిరణా షాపులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించామన్నారు. ఇంతలోనే పక్కన వున్న బూతపాటి గురువయ్య షాపుకు మంటలు వ్యాపించాయన్నారు.రెండు దుకాణాలలోని వస్తువులు పూర్తిగా దగ్గమయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొని వచ్చారు.ఒక్కొక్క దుకాణంలో సుమారు 6 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.అనంతరం తహసిల్దారు షేక్.ఫజిహాకు వినతి పత్రం అందించారు.

## సీతారామపురం టిడిపి కన్వీనర్‌గా చింతల శ్రీను



**సీతారామపురం నవంబర్ 11 ప్రభాతవార్త :** సీతారామపురం నూతన టిడిపి మండల కన్వీనర్‌గా చింతల శ్రీనును నియమించిన్నటుఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్ ప్రకటించారు. మంగళవారం వింజమూరులోని పార్టీ ప్రధాన కార్యలయంలో నూతన కమీటిలను ఆయన ప్రకటించారు. ఇప్పటి వరకు సీతారామపురం మండల టిడిపి కో ఆర్డినేటర్‌గా విదులు నిర్వహిస్తున్న చింతల శ్రీనును టిడిపి మండల కన్వీనర్‌గా నియమించినట్లు ప్రకటించారు ఈ సందర్భంగా నూతన మండల టిడిపి కన్వీనర్ చింతల శ్రీను మాట్లాడుతు టిడిపి పట్ల అంకిత భావంతో పనిచేసిన తన పైన నమ్మకం ఉంచి సీతారామపురం మండల టిడిపి అద్యక్షులుగా కీలక బాద్యతలు అప్పగించిన నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్‌కు దన్యవాదాలు తెలిపారు. అదే విధంగా సీతారామపురం మండలంలో టిడిపిని మరింత బలోపేతం చేసి ప్రతి ఒక్కరికి అందుబాటులో వుంటు పార్టీ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి ఒక్కరికి అందించి సీతారావపురం గడ్డ టిడిపి అడ్డా అనేలా తయారు చేస్తానని అన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి ప్రధాన్యత ఉంటుందని అన్నారు.

## విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు



**ఆత్మకూరు, నవంబరు11ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం నాగులపాడు,చెర్లో యడవల్లి గ్రామాలకు చెందిన లైన్‌మెన్ పాణెం విజయ్ మంగళవారం నెల్లూరుపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ స్థంభం ఎక్కి మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలైనాయి. చికిత్సకై ఆత్మకూరులోని హాస్పెటల్‌కు తరలించి చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. పాణెం విజయ్ స్వగ్రామం అనంతసాగరం మండలం సంజీవనగరం. విద్యుత్ నిలుపుదల చేసే విషయంలో సిబ్బంది సమన్వయ లోపం వలన ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం.

## రమణయ్య కుటుంబ సభ్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం



**దగదర్తి, నవంబర్ 11, ప్రభాతవార్త :** తాళ్లూరు రమణయ్య నాయుడు ఆయన ప్రజల కోసం ఎన్నో సేవలు చేసి ఉన్నారు ఆయన ప్రధమ వర్ధంతి సందర్భంగా దగదర్తి గ్రామంలో తాళ్లూరు రమణయ్య నాయుడు కుటుంబ సభ్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ వైద్యులు పర్యవేక్షించి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలో ప్రజలు విశేషంగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.

## నెల్లూరులో ఘోర రోడ్డు ప్రమాదం పట్ల ఎంపీ వేమిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

**నెల్లూరు, నవంబర్ 11, ప్రభాతవార్త :** నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. లారీ అతి వేగంతో వచ్చి ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు చెప్పారు. నిరుపేదలైన మొక్కజొన్న కంకులు అమ్ముకునే వారితో పాటు వాటిని కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిపై లారీ దూసుకెళ్లడం విషాదకరమని చెప్పారు. రహదారి ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు దేవుడు మనోధైర్యం అందించాలన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్ధించారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**నెల్లూరు, నవంబర్ 11, ప్రభాతవార్త – వైద్యం :** 33/11 కేవీ ఏకే నగర్ సబ్ స్టేషన్‌లోని 11కేవీ నిప్పో ఫీడర్ నందు చెట్ల కొమ్మల తొలగింపు రిత్విక్ లేఅవుట్, కరెంటు ఆఫీస్ మెయిన్ రోడ్డు నుండి వేదాయపాలెం వరకు ఉదయం 8గంటల నుండి ఉదయం 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేస్తున్నానని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్ తెలియజేశారు.

## చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు



**వింజమూరు, నవంబర్ 11, ప్రభాతవార్త :** వింజమూరు పట్టణంలోని గోనుగుంట రామయ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల మేళా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అధికంగా ప్రస్తుతం వరి సాగు చేస్తూ ఉండటం వలన రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని, దానికి ప్రత్యామ్నాయ పంటగా చిరుధాన్యాలు సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. రైతులకు అవగాహన కార్యక్రమాలను సద్వినియోగపరుచకోవాలని అన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి మాట్లాడుతూ చిరుధాన్యాలు సాగుకు ఉదయగిరి నియోజకవర్గం అనుకూలమైన ప్రాంతంగా ఉంటుందని తద్వారా రైతులు అధిక మొత్తంలో చిరుధాన్యాలు సాగు చేయాలని ఆమె తెలియజేశారు. చిరు ధాన్యాల సాగు చేయడంలో రైతులకు లాభసాటిగా ఉంటుందని, పోషక విలువలు ఎక్కువగా ఉండడం వల్ల ప్రజారోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, ఆత్మ డీపీవో మురళి, జిల్లా ఏడీఏ నర్సోజీరావు, ఐటీడీఏ ఏపీవో నీరజా, వింజమూరు సబ్ డివిజన్ ఏడీఏ శేషగిరి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏవో వాసు, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నేతలు దామా మహేష్, ఏరా కృష్ణయ్య, పాములపాటి మాల్యాద్రి, ఇతర నేతలు, నాలుగు మండలాల వ్యవసాయాధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## మండల తెలుగుదేశం రథసారథిగా గూడా



**వింజమూరు, నవంబర్ 11, ప్రభాతవార్త :** వింజమూరు మండలం తెలుగుదేశం పార్టీ కన్వీనర్‌గా గూడా నర్సారెడ్డిని పార్టీ అధిష్టానం మంగళవారం ప్రకటించింది. స్థానిక తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్‌గా గూడా నర్సారెడ్డిను ప్రకటించారు. పార్టీ కోసం నిబద్దతతో పని చేసే నేతకు మండల బాధ్యతలను పార్టీ అప్పగించడంలో మండల నేతల్లో ఆనందాలు వెలువెత్తుతున్నాయి. పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే నర్సారెడ్డి తెలుగుదేశం పార్టీ అంటే ప్రాణంగా భావించి పదవులు లేకపోయినా ఉన్న పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తాడు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గెలుపుకు ఎంతగానో కృషి చేశాడు. తన కుటుంబ సభ్యులు సైతం పార్టీ కోసం వారి సొంత పనులను పక్కన పెట్టి కాకర్ల గెలుపుకు కృషి చేశారు. అలాగే మండల నేతలతో కలిసి పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ ఒక డైనమిక్ లీడర్‌గా మండల ప్రజల హృదయాలలో నిలిచారు. నర్సారెడ్డి నియామకం పట్ల నాయకులు, కార్యకర్తలు, అభిమానలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గూడా నర్సారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోదరుడు సునీల్ తనను తన కుటుంబ సభ్యులను వారి కుటుంబ సభ్యులుగా భావించి వారి చూపిన ప్రేమ ఆప్యాయత ఎప్పటికి మరువలేనిది అని అన్నారు. తాను జీవితాంతం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు రుణపడి ఉంటానని అన్నారు.

## బీద రవిచంద్రని మర్యాద పూర్వకంగా కలిసిన శ్రీపతి బాబు



**నెల్లూరు,నవంబర్ 11 ,ప్రభాతవార్త –వైద్యం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యులు గా నియమి తులైన తిరుపతి పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీపతి బాబు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్రని మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాల యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీద రవిచంద్రని , మంతెన సత్యనారాయణ రాజుని , శ్రీపతి బాబు శాలువాతో సన్మానించారు.

## రైతులు మోతాదు మించి యూరియా వాడొద్దు



**సైదాపురం, నవంబర్ 11, ప్రభాతవార్త :** రైతులు సాగు చేస్తున్న పంటలు సత్వరమే ఎదగా లంటే యూరియా మోతాదు మించి వాడకూడదని ఎక్కువ వాడడం వలన భూసారం దెబ్బతిని నేల సహజత్వాన్ని కోల్పోతుందని మండల వ్యవసాయ శాఖాధికారిణి హైమావతి తెలిపారు. మండల పరిధిలోని తురిమెర్ల,దేవరవేమూరు గ్రామ రైతు సేవ కేంద్రం పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వేసిన పంటలను పరిశీలించారు. అనంతరం స్థానిక రైతు సేవ కేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ చేశారు. రైతులు యూరియా వాడటం తగ్గించాలని అన్నారు. లేని యెడల భూమి కాలుష్యం, నీటి కాలుష్యంతో పాటు పర్యావరణ కాలుష్యం మానవ ఆరోగ్యం క్యాన్సర్ల వంటి ప్రాణాంతక రోగాలు పురుగు మందుల వలన వస్తాయని తెలిపారు. ఆర్ఎన్ఆర్ 15048 వరి రకం నవంబర్ 15వ తేదీ పైన వాడితే ఆశించిన విధంగా దిగుబడులు వస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

## జలదంకి మండల టీడీపీ అధ్యక్షులు గా మునగాల



**జలదంకి నవంబర్ 11 ప్రభాతవార్త:** జలదంకి మండల టీడీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గా మునగాల.తిరుమల రెడ్డి, ఉపాధ్యక్షులు గా వేల్పుల.వేణుగోపాల్ నియమితులు అయినారు. వింజమూరు లో మంగళవారం శాసనసభ్యులు కాకర్ల. సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో వారు పదవీబాద్యతలు స్వీకరించారు. అధ్యక్షులు చామదల గ్రామవాసి కాగా ఉపాధ్యక్షులు అన్నవరం కు చెందిన వారు. నూతనంగా నియమితులు అయిన వారిని మండలం లోని టీడీపీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

## గిరిజన ప్రతి బిడ్డ చదువుకోవాలి: తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు,నవంబర్ 11 ప్రభాతవార్త :** గిరిజనులు హక్కులను తెలుసుకుని మంచి భవిష్యత్తు వైపు నడవాలని తద్వారా కుటుంబాలు అభివృద్ధి చెంది సంతోషంగా ఉంటారని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. ఏ ఆర్ డి, నాబార్డ్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం వినాయక గిరిజన కాలనీలో గిరిజనులకు ప్రభుత్వ పథకాల హక్కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి గిరిజన కుటుంబంలో పెద్దలు వారి పిల్లలను పాఠశాలకు పంపి మంచి చదువులు చదివించాలని అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఆధార్, రేషన్ కార్డ్ తప్పనిసరి అదేవిధంగా బ్యాంకు అకౌంటు కూడా అందరికీ ఉండాలని వివరించి తెలిపారు. అనంతరం నాబార్డ్ డి డి ఎం బాబు,ఏ ఆర్ డి బషీర్, కోవూరు మాజీ ఎంపీపీ రవణమ్మ లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంటూ ఆరోగ్యం కాపాడుకోవాలని సలహాలు ఇచ్చారు. అలాగే హక్కుల గురించి వివరించి తెలిపారు. అనంతరం తుఫాన్ వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో ప్రియదర్శిని, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు యూరియా కార్డ్సు తప్పనిసరిగా తీసుకోవాలి



**కలువాయి నవంబర్ 11 ప్రభాతవార్త :** మండలంలో రైతులకు కావాలసిన యూరియా ,పచ్చిశనగలు తగినంత అందుబాటులో వుంచుతామని రైతులు ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రతి రైతు యూరియా కార్డ్సును తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి చాల్లా కళారాణి తెలిపారు. మండలంలోని చీపినాపి గ్రామంలో ఏఒ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఏఒ మాట్లాడుతు యూ రియా అవసరమైనంత మోతాదు లోనే ఉపయోగించుకోవాలని అధికంగా యూరియా వాడడం వల్ల వచ్చే అనర్దాలను తెలియజేశారు. అదే విధంగా కుల్లూరు గ్రామంలో యూరియా కార్డ్సు రైతులకు అందజేసి దానిని అనుసరించి యూరియా రైతులకు పంపీణి చేయడం జరిగిందని ప్రస్తుతం కలువాయిలో కూడా యూరియా పంపీణి కొనసాగు తుందని రైతులు యూరియా కార్డ్సు ద్వారానే తీసుకోవాలని ఆమె కోరారు.

## 16న కార్తీక మాస వన భోజన మహోత్సవం



**కలువాయి నవంబర్ 11 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా యాదవ్ భవన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక మాస వన బోజన మహోత్సవానికి యాదవ సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కలువాయిలో సోమవారం కార్యక్రమానికి సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆహ్వాన కమీటి సభ్యులు మాట్లాడుతు ఈనెల 16న మర్రిపాడు మండలంలోని టిఎన్ఆర్ బృందావనం నందు పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకొని గోపూజ, ఉసిరికచెట్టు పూజ, పరమేశ్వరునికి విశేష పూజలు నిర్వహించడంతోపాటు వన బోజన మహోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. యాదవకుటుంబీకులందరు కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో నెల్లూరు జిల్లా యాదవ్ భవన్ ట్రస్టు ప్రెసిడెంట్ బొమ్మి నాగకిషోర్‌యాదవ్, బిసి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పెరుమాళ్ళ పద్మజాయాదవ్, వేప జిల్లా అధ్యక్షులు పెరుమాళ్ళ కొండయ్యయాదవ్,మండల బిసి సంఘం అధ్యక్షులు అరిబోయిన సుందరయ్యయాదవ్, మల్లికార్జున యాదవ్, బొలిగర్ల ప్రవీణ్‌యాదవ్, దామేన బోయిన మహేష్‌యాదవ్,పవన్ కళ్యాణ్‌యాదవ్, పెయ్యల ప్రసాద్‌యాదవ్,గొబ్బిళ్ళ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ బాంబు పేలుళ్లు మృతులకు బీజేపీ నివాళులు



**నెల్లూరు అగ్రికల్చర్, నవంబర్ 11, ప్రభాతవార్త:** ఢిల్లీలో జరిగిన కారుబాంబు పేలుడు మృతులకు బీజేపీ నేతలు, కార్యకర్తలు కర్పూర హారతులు ఇచ్చి నివాళులర్పించారు. నెల్లూరులోని అలం కార్ సెంటర్లో ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, మురుగ నరేష్ తదితరులు మాట్లాడుతూ భారతదేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించారని పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలు పేలుళ్లకు తెగబడుతున్నాయని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశంలో పేలుళ్ల తీవ్రంగా ఉంటాయని జైషే మహమ్మద్ ప్రకటించిందని అయితే, ఎన్ఐఏ పోలీసు వ్యవస్థ పటిష్టంగా పని చేసి అనేక మంది ఉగ్రవాదులను అరెస్టు చేసి భారీ విధ్వంసాలను అదుపు చేశారని పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థలు విధ్వంసాలు సృష్టిస్తూ దేశ ప్రజల ప్రాణాలు తీస్తుండడం పట్ల భారత సమాజం ఆందోళన చెందుతుందన్నారు. పాక్ ఉగ్రవాదాన్ని భారత ప్రభుత్వం సమూలంగా అంతం చేయాలని బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరు నాగేంద్ర సింగ్, శ్రావ్య, సృజన, ఏవీ సుబ్బయ్య, కందుకూరు శివకుమార్, గన్నవరం దశరథ రామయ్య, సోమ గోపాల్, చిట్టిబాబు, విజయ గోపాల్, నాగలక్ష్మి, బుధవరపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మడపల్లిలో రైతులకు యూరియా పంపిణి



**చేజర్ల నవంబర్ 11 ప్రభాతవార :** చేజర్ల మండలం మడపల్లి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తొంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు యూరియా పంపిణి చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ షేక్.సిరాజుద్దీన్ సొసైటీ అద్యక్షులు బూదల్ల వీర రాఘవరెడ్డి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రావి పెంచలరెడ్డి పాల్గొనడం జరిగింది. ఈకార్యక్రమంలో టిడిపి మండల అద్యక్షులు మాట్లాడుతు రబీ సీజనకు సంబంధించిన యూరియా పుష్కలంగా అందుబాటులో ఉందని రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని తెలియజేశారు. ఒక్క ఎకరాకి మూడు బస్తాలు చొప్పున యూరియా రైతులకు అందించడం జరుగుతుందన్నారు. అందుకు సంబందించి రైతులకు యూరియా కార్డు అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.హిమబిందు, పిఏఎలు మేఘన వర్షిణి, రైతులు పాల్గొన్నారు.

## విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం..!

**– భారత రత్న మోలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంత్యోత్సవ సభలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 11, ప్రభాతవార్త :** అందరూ విద్యావంతులయితేనే దేశం ఆర్ధికంగా అభివృద్ధి చెందుతుంది. విద్యతోనే పేదరికాన్ని దూరం చేయగలమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. మంగళవారం కలెక్టరేట్ శంకరన్ హాలులో భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137 వ జయంతి వేడుక కార్యక్రమం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో పేదరికాన్ని దూరం చేయగలమని, కులం, మతం, వర్గం ఇవేవీ విద్యకు ప్రామాణికాలు కావన్నారు. భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారత రత్న అవార్డు గ్రహీత మోలానా అబుల్ కలామ్ ఆజాద్ విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని స్వతంత్య సమరయోధులుగా, కవిగా, రచయితగా, పాత్రికేయులుగా, విద్యావేత్తగా ఆయన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఆయన జయంతి వేడుకను జాతీయ విద్యా దినోత్సవంగా, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతం మన దేశ ప్రజలు ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్టమైన సేవలు అందిస్తున్నారంటే అందుకు కారణం విద్యారంగానికి మోలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషే అన్నారు. ఆయన కృషి ఫలితంగానే మన దేశంలో విద్యాభివృద్ధి సాధ్యమైందన్నారు. ఎవరూ దొంగిలించలేని స్థిరమైన ఆస్తి విద్య మాత్రమే అని, ప్రతి విజయానికీ నాంది కూడా విద్యనే అని కలెక్టర్ సందేశమిచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆజాద్ భారత విద్యా వ్యవస్థకు బాటలు వేసి, సమగ్ర, నాణ్యమైన విద్య అందరికి అందుబాటులో ఉండాలనే దృష్టితో పలు కీలక సంస్కరణలు చేపట్టారన్నారు. విద్య ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమని విశ్వసించిన వ్యక్తి ఆజాద్ అని అన్నారు. విద్యార్థులందరూ ఆ మహనీయుని సేవలను స్మరించు కుంటూ భావి భారత పౌరులుగా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యా రంగం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. తొలుత మోలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయ్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి మహమ్మద్ అయుబ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ నూతన ట్రాన్స్ఫారం ఏర్పాటు



**కొడవలూరు, నవంబర్ 11 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని అధిక లోడుతో విద్యుత్ సమస్య ఉన్నప్పటికీ గండవరం ఏడి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు విద్యుత్ నూతన ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయడం జరిగిందని కొడవలూరు విద్యుత్ శాఖ ఏఈ రాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు విద్యుత్ పొదుపుగా వాడుకున్నట్లయితే ప్రతినెల విద్యుత్ బిల్లు లు తగడం జరుగుతుంది అదేవిధంగా విద్యుత్ సరఫరా అంతర్యం కలగకుండా ఉంటుందని తెలియజేశారు. గుండాలమ్మపాలెం సొసైటీ డైరెక్టర్ పంది శ్రీనివాసులు, షేక్ బాచి, పి. దాని భాయ్, షేక్ ఖాజా నవాజ్ పాల్గొన్నారు.

## ఎకరంకు మూడు బస్తాలు యూరియా అందిస్తాం ఏవో శ్రీలక్ష్మీ



**విడవలూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:** మండలంలోని పొలం ఉన్న ప్రతి రైతుకు ఎకరంకు మూడు బస్తాలు యూరియా అందించడం జరుగుతుంది ప్రతి రైతు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. విడవలూరు, మన్మధరావుపేట గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో యూరియా కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని ప్రతి ఒక్క రైతుకు ఎకరంకు మూడు బస్తాల వంతున కార్డు ఇవ్వడం,పొలమున్న ప్రతి ఒక్క రైతు కూడా సంబంధిత రైతుసేవ కేంద్రాన్ని సంప్రదించి కార్డు పొందాలని కోరారు.నవంబర్ 15 తేదీ నుండి కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 వరి రకాలు నార్లు పోసుకోవడానికి అనుకూలమని తెలియచేశారు. రైతులు విత్తనశుద్ధి క్నార్బడజిమ్ పొడి తో చేసుకోవడం వలన తొలి దశలో విత్తనాలు ద్వారా వచ్చే తెగుళ్ల నివారణ చేయవచ్చున్నారు. వి ఏ ఏ కె.విష్ణు ప్రియ, విడవలూరు సొసైటీ చైర్మన్ పురందర్ రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విడవలూరుకు ఎమ్మెల్యే రాక

**విడవలూరు,నవంబర్ 11 ప్రభాతవార్త:** తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విడవలూరు మండల కేంద్రానికి రానున్నట్లు మండల టిడిపి నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల టిడిపి సీనియర్ నాయకులు,కోవూరు నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు మాతూరు శ్రీనివాసులు రెడ్డి మృతి చెందారు. ఆయన సంస్మరణ సభ లో పాల్గొంటారు.

## కార్యకర్తలే అధినేతలు



**నెల్లూరు, నవంబర్ 11, ప్రభాతవార్త:** కార్యకర్తలను, నాయకులను ప్రోత్సహించే బాధ్యత నాది.నెల్లూరు రూరల్ లో తెలు గుదేశం పార్టీ ఒక తిరుగులేని శక్తిగా ఉంది నిరంతరం ప్రజల్లో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయండి. నేడు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 వ డివిజన్ నుంచి 41వ డివిజన్ వరకు వివిధ స్థాయిల్లో పదవులు పొందిన నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ పాల్గొన్నారు.తెలుగుదేశం పార్టీకి కష్టకాలంలో కష్టంచేసిన నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటా. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఎన్నికలు ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజల్లో ఉందాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం సోమవారం నుండి ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు గంటపాటు సమయం కేటాయిస్తా. ఏకాంతంగా మాట్లాడండి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. కార్యకర్త నుండి ఎమ్మెల్యే దాక ఒకే విధంగా గౌరవించే పార్టీ తెలుగుదేశం పార్టీ. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 100కి 100 శాతం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ లో తెలుగుదేశం పార్టీ గెలిచితీరుతుంది. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, కో క్లస్టర్ ఇంచార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాలుఢీ ముగ్గురికి తీవ్ర గాయాలు





**బుచ్చి నవంబర్ 10 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలం కాగులుపాడు వద్ద ముంబాయి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు నుండి వస్తున్న ద్విచక్ర వాహనం కాగులపాడు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద నాగమాంబాపురం గ్రామానికి మలుపు తీసుకుంటున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొ ట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వా హనాలపై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసులురెడ్డి ,ఎస్ఐ సంతోష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.గాయపడిన వారిని చికిత్స నిమిత్తం బుచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మైనారిటీలకు చదువు దగ్గర చేయడమే మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కి నిజమైన నివాళి




**నెల్లూరు సిటీ, నవంబర్ 11, ప్రభాతవార్త :** మైనారిటీలకు చదువు దగ్గర చేయడమే మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కి నిజమైన నివాళి అని ఆవాజ్ నెల్లూరు జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ అన్నారు. ఈ రోజు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పి ంచారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ నాడు స్వాతంత్ర అనంతరం మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ బాధ్యతలు తీసుకొని ఆయన పరిధిలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొని వచ్చారని కొనియాడారు. మౌలానా అంటే అన్ని రకాల శాస్త్రాలలో మునిగి తేలిన పరి పూర్ణత కలిగిన వ్యక్తి గా తెలిపారు. దేశ స్వాతంత్ర పోరాటం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రజలను కుల, మత, భేద భావం లేకుండా అందరినీ సమీకరించారన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారని ఖిలాఫత్, ఉప్పు సత్యాగ్రహం ,క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. ఈయన హయాంలోనే యు జిసి, ఐసిసి, ఆర్‌ఏఐ, సిటియు, సిఐఎస్ఆర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో పాటు ఖరగ్ పూర్‌లో సాంకేతిక విద్యాసంస్థను నెలకొల్పారన్నారు. భారత ప్రభుత్వం విద్యారంగానికి సంబంధించి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కి భారతరత్న బిరుదు ఇచ్చి సత్కరించిదన్నారు. నేడు మైనార్టీలకు విద్య దూరం అవుతుందని దానిని దగ్గర చేయడం ప్రస్తుతం అందరి బాధ్యత అని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బీపీ నరసింహ మాట్లాడుతూ పుస్తకాల్లో చరిత్రని ఇటువంటి నాయకులు చరిత్ర ప్రతి ఒక్కరికి తెలియాల్సి న అవసరం ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ విధ్యార్థులు స్వతంత్ర పోరాటం, చరిత్ర గురించి అవగాహనా చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంకి ఆవాజ్ నగర కార్యదర్శి షేక్ రియాజ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం వి రమణ, ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, పి షబ్బీర్, నగర అధ్యక్షుడు షేక్ ఫయాజ్ నగర కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షేక్ సమీవుల్లా, రిటైర్డ్ సంఘం నాయకులు పి. సుబ్రహ్మణ్యం, సుధాకర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందుకూరుపేట ప్రాంతీయ పశువైద్యశాల ఏడీకి డీడీగా పదోన్నతి



**ఇందుకూరుపేట, నవంబర్ 11, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట ప్రాంతీయ పశువైద్యశాలలో పని చేయుచున్న డాక్టర్ బి.మురళీకృష్ణ ఏడీకి డిప్యూటీ డైరక్టర్‌గా పదోన్నతి లభించింది. డీడీ ప్రమోషన్‌లో ప్రకాశం జిల్లా ఒంగోలు పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. ఈ సందర్భంగా ఇందుకూరుపేట పశువైద్యశాల సిబ్బంది, రైతులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## డయల్ యువర్ సీఎండీ కార్యక్రమంకు కృతజ్ఞతలు




**నెల్లూరు, నవంబర్ 11, ప్రభాతవార్త -వైద్యం :** నెల్లూరు టౌన్‌లోని వేదాయ పాలెం ప్రాంతానికి చెందిన వినియోగదారుడు శ్రీ మల్లిఖార్జున తన షాప్ దగ్గర ఉన్న విద్యుత్ స్తంభంకు డిష్ వైర్స్ గుట్టలుగా కట్టిఉన్నారని వాటిని తొలగించమని డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం ద్వారా నవంబర్ 10వ తేదీన తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆంధ్రప్రదేశ్ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎల్.శివశంకర్ సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే ఈ రోజు ఏకే నగర్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఏ.అశోక్, అసిస్టెంట్ ఇంజనీర్ విజయ్ తమ సిబ్బందితో కలసి వినియోగదారుని షాప్ వద్దకు వెళ్లి మల్లిఖార్జునతో మాట్లాడి తన సిబ్బందితో, డిష్ ఆపరేటర్లను కూడా పిలిచి వారితో మాట్లాడి వెంటనే గుట్టలుగా ఉన్న డిష్ వైర్స్‌ను తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా షాప్ ఓనర్ శ్రీ మల్లిఖార్జున మాట్లాడుతూ మా సమస్యను వెంటనే పరిష్కరించిన సీఎండీకి, అలాగే వెంటనే స్పందించి పని పూర్తి చేసిన అధికారులు, సిబ్బందికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. డయల్ యువర్ సీఎండీ వంటి కార్యక్రమాలు సామన్య ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించడంలో ఎంతో దోహదం చేస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు సీఎండీ కి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

## ఆర్ ఎస్ ఆర్ లో ఘనంగా నేషనల్ ఎడ్యుకేషనల్ డే



**బిట్రగుంట నవంబర్ 11 ప్రభాతవార్త:** బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బ రామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో భారత మొదటి విద్యా శాఖ మంత్రి మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నేషనల్ ఎడ్యుకేషన్ డే నీ కళాశాల ఐఐసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి వి ఎన్ రెడ్డి తెలిపారు. వారు ఈ సందర్బంగా మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం గురించి, విద్య యొక్క ప్రాముఖ్యత గురించి బీటెక్ విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగ అధిపతి అయిన డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ నైతిక విలువలతో, క్రమశిక్షణతో, సమయపాలన పాటించాలని విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్ వి రమణారెడ్డి, ఐఐసీ అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ పి. బృందావని , అన్ని విభాగాల అధిపతులు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## విశ్వోదయ బాలుర పాఠశాలలో విద్యా దినోత్సవ వేడుకలు

**కావలి, నవంబర్ 11, ప్రభాతవార్త:** కావలి డాక్టర్ ఎల్.కె.ఆర్ విశ్వదయ బాలుర ఉన్నత పాఠశాల నందు మంగళవారం జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భారతరత్న ,కేంద్ర ప్రప్రథమ విద్యాశాఖ మంత్రి డాక్టర్ మోలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయులు సిహెచ్.బ్రహ్మయ్య మాట్లాడారు డాక్టర్ మోలానా అబ్దుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో బ్రిటిష్ వారిని ధైర్యంగా ఎదిరించి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేసి సేవలను అందించడం జరిగింది.విద్యాశాఖ మంత్రిగా ఐఐటి,యుజిసిల స్థాపనలో వీరి కృషి ఎనలేనిదన్నారు.సాంస్కృతిక అకాడమీల స్థాపనలో ఎనలేని సేవ చేసి భారతదేశంలో విద్యావ్యాప్తికి కృషి చేశారని తెలియజేశారు. హిందీ ఉపాధ్యాయులు ఎస్.కె షరీఫ్ మాట్లాడారు మైనారిటీ దినోత్సవ ప్రాధాన్యతను గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. విభిన్న మతాలు కలిగిన భారత దేశంలో భారతీయ పౌరులు ఐకమత్యంతో మెలగాలని, జాతీయ భావం కలిగి ఉండాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు కుమారి జి.కళ్యాణి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సీపీఆర్ పై అవగాహన



**కావలి, నవంబర్ 11, ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం, సర్వాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాల నందు పాఠశాల ప్రధా నోపా ధ్యాయులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జూనియర్‌రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు సీపీఆర్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఫీల్డ్ ఆఫీసర్ సుందర రాజు మాట్లాడారు కార్డియోపల్మోనరీ రిససిటేషన్ (సీపీఆర్) అనేది ఛాతీ కుదింపులు మరియు రెస్క్యూ శ్వాసలతో కూడిన అత్యవసర ప్రక్రియ అని ఇది కార్డియాక్ అరెస్ట్‌కు ప్రాణాలను కాపాడే చర్య అని పేర్కొన్నారు.ఏ పరిస్థితులలో సీపీఆర్ చేయాలో, ఎలాచేయాలో వివరించి, వారికి శిక్షణ ఇచ్చారు. హార్ట్ ఎటాక్ మరియు కార్డియా కరెస్ట్ మధ్య భేదాలను వివరిస్తూ నివారణ ఉపాయాలను తెలియజేశారు.కావలి రెడ్ క్రాస్ పాలకమండలి , జూనియర్ రెడ్ క్రాస్ బాధ్యులు బెజవాడ ప్రసన్న కుమార్ మాట్లాడారు ప్రతి విద్యాసంస్థలో సీపీఆర్ మరియు ప్రాథమిక చికిత్సపై అవగాహనా కారయ్రక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.పాఠశాల విద్యార్థిని, విద్యార్థులచే ప్రయోగాత్మకంగా సి.పి.ఆర్. చేయించగా ఉత్సాహంగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంపై ఎమ్మెల్యే సోమిరెడ్డి దిగ్భ్రాంతి

**నెల్లూరు, నవంబర్ 11, ప్రభాతవార్త -వైద్యం :**నెల్లూరులోని శ్రీ వేణుగోపాలస్వామి కళాశాల మైదానం వద్ద హైవేపై ఘోర ప్రమాదం జరిగి పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నిత్యం నేను రాకపోకలు సాగించే మార్గంలో ఈ దారుణం జరగడం జీర్ణించుకోలేకపోతున్నాను. మొక్కజొన్న కంకులు అమ్ముకునే వారితో పాటు వాటిని కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిపై లారీ దూసుకెళ్లడం బాధాకరం. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారనకు పటిష్ట చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని తీవ్ర గాయాల పాలైన వారు క్షేమంగా కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానను అని తెలియజేశారు.

## ఉదయగిరిలో భూదందా

**ఉదయగిరి, నవంబర్ 11, ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిలో చుట్టూ అటవీశాఖ భూములు ఉండటం వల్ల ఒక వైపు మాత్రమే మార్కెట్ విస్తరిస్తూ ఉంది. ఇది అవకాశంగా చేసుకున్న రియల్ దందాకు తెర తీశారు. ఉదయగిరిలో బతకలేక బయట రాష్ట్రాలకు వెళ్లి బతుకు తెరువు కోసం పని చేసుకుంటున్న వందలాది మంది ఈ లాజిక్ మిస్ అయ్యారేమో అనిపిస్తుంది. ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు లక్షలాది రూపాయలకు విక్రయిస్తే ఇక్కడే కోటేశ్వరులు కావచ్చు అన్న చిన్న విషయం మర్చిపోయి ఈ ప్రాంతం నుంచి వలస వెళ్తున్నారు చాలా మంది. కానీ ఈ ప్రాంతాన్ని వెతుక్కుంటూ వచ్చిన అలాంటి భూములన్నీ అమ్మి అధికారులను మభ్యపెట్టి ప్రలోభ పెట్టి కోట్లు గడిస్తున్నప్పటికి అధికారుల నుంచి ఎలాంటి పరిశీలన లేకపోవడం విశేషం. అతి ప్రాచీనమైన బోడబండ కాలువ పోరంబోకు స్థలం సుమారు 50 లక్షలకు వెంచర్లు వేసి విక్రయిస్తే ఈ విషయం సదరు డీఈ ఇరిగేషన్ దృష్టికి వెళ్ళగా ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి మంగళవారం ఆక్రమణ స్థానాన్ని మరొకసారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వివరణ ఇస్తూ తహసీల్దార్ కార్యాలయానికి రెండు లెటర్లు పెట్టుకున్నానని సర్వే కోసం అభ్యర్థించానని ఇప్పటి వరకు రెవెన్యూ శాఖ నుంచి సమాచారం లేదని బోడబండ కెనాల్‌పై ఉన్న వృక్షాలను తొలగించి అదే కాలువలో పడేశారని ఇరిగేషన్ డీఈ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ల్యాండ్ మాఫియాని అడ్డుకోవాలంటే శాసనసభ్యులు వలన అవుతుందని తాము చేసేది ఏమి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## పెండ్యాల సునీల్ కు డాక్టరేట్ ప్రధానం



**కావలి, నవంబర్11, ప్రభాతవార్త:** కావలి విక్రమ సింహపురి యూనివర్సిటీ కళాశాల నందు కామర్స్ డిపార్ట్ మెంట్ రీసెర్చ్ స్కాలర్ పెండ్యాల సునీల్ కు డాక్టరేటు పురస్కారం లభించింది. ప్రిన్సిపాల్,కామర్స్ విభాగాధిపతి మరియు బి.ఓ.ఎస్. చైర్మన్ ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఏ.పీ.ఎస్.ఆర్.టి.సి.) పనితీరు మరియు నెల్లూరు ఏ.పీ.ఎస్.ఆర్.టి.సి. నాణ్యత సేవలు గ్రామీణ ప్రాంతాల్లో ఏ.పీ.ఎస్.ఆర్.టి.సి. రవాణా ప్రాముఖ్యత అనే అంశంపై పెండ్యాల సునీల్ పరిశోధన చేయడం జరిగింది.ఈ పరిశోధనలో భాగంగా ఏ.పీ.ఎస్.ఆర్.టి.సి. ఆంధ్రప్రదేశ్ మరియు ఏ.పీ.ఎస్.ఆర్.టి.సి నెల్లూరు జిల్లాను ఎంపిక చేసుకొని,వాటి సేవలను, సమర్ధనీయతను వివిధ కోణాల నుంచి విసిదీకరించడం జరిగింది.ఈ సందర్భంగా పెండ్యాల సునీల్ మాట్లాడారు ఈ పరిశోధన వల్ల ఏ.పీ.ఎస్.ఆర్.టి.సి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విధాన నిర్మాతలు మరియు ఏ.పీ.ఎస్.ఆర్.టి.సి. నాయకత్వం సంస్థ యొక్క ఆర్థిక, కార్యకలాప మరియు భౌతిక పని తీరును ప్రాంతీయ మరియు డిపో స్థాయిలలో మెరుగుపరచడానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేశారు.సలహాలు ఇవ్వడం జరతన పరిశోధనకు మార్గదర్శకత్వం చూపిన ఆచార్య చిలుమూరి శ్రీనివాస రావుకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పెండ్యాల సునీల్ కు కామర్స్ డిపార్టుమెంటు అధ్యాపకులు, సహ స్కాలర్స్ మరియు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### విజయవాడలో జరిగిన సమావేశానికి తరలి వెళ్ళిన కావలి విశ్రాంత ఉద్యోగులు



**కావలి, నవంబర్ 11,ప్రభాతవార్త:** ఏపీ ఎన్జీవో మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సిహెచ్. అజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర కార్యా లయంలో జరిగిన కార్యక్రమానికి కావలి నుండి విశ్రాంత ఉద్యోగులు హాజరు కావడం జరిగిం ది.50 మంది కి పైగా పాల్గొన్న ఈ సమావేశంలో ఫ‌న్షనర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించడం జరిగింది. పదవి విరమణ చేసి ఐదు సంవ త్సరాలు అయినప్పటికీ 2020 ఏప్రిల్ నుండి 2021 డిసెంబర్ వరకు పదవీ విరమణ చేసిన వారికి ఎన్కా ష్మెంట్ ఆఫ్ ఎర్నేడ్ ఎర్నేడ్ లీవ్ డిఫరెన్స్ రావాలి. కనీసం బిల్లులు కూడా ట్రెసరీ కి వెళ్ళలేదు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలోనటశేఖర్,ప్రకాష్ ,సుబ్బారావు, మాల్యాద్రి ,నరసిం హారావు, నాగరాజు ,వెంకటేశ్వర్లు ,కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## భారత రత్న మౌలానా అబుల్ కలాంకు ఘన నివాళులు



**కోవూరు, నవంబర్ 11 ప్రభాతవార్త :** కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి ఎంపీడీవో శ్రీహరిరెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో విద్య పునాదిని స్థాపించడంలో ఆయన చేసిన కృషి భారతదేశం అంతటా జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. మౌలానా ఆజాద్ మహాత్మా గాంధీ అహింసాయుత కార్యక్రమాలకు ఉత్సాహభరితుడై ఆయన మద్దతుదారుడుగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ రాధ, పీ-4 ఉద్యోగులు, ఆఫీస్ సబార్డినేట్‌లు ఉన్నారు.

## నిరసన ర్యాలీను విజయవంతం చేయండి



**వింజమూరు, నవంబర్ 11, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉదయగిరి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ఉదయగిరిలో జరిగే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని వింజమూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రేవూరి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్య వరప్రదాయిని అయినా మెడికల్ కాలేజీలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలనుకోవడం చాలా దుర్మార్గమైన చర్య అని పేదల ఆరోగ్యంతో చెలగాటాలాడే ఇలాంటి ప్రభుత్వ నిర్ణయాలను తీవ్రంగా ప్రజలు నిరసన తెలియజేయాలి అన్నారు. ఉదయగిరిలో జరిగే ఈ నిరసన కార్యక్రమానికి మండలంలోని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

## క్లస్టర్ ఇన్‌చార్జిగా వసంతరావు



**వింజమూరు, నవంబర్ 11, ప్రభాతవార్త :** వింజమూరు తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిగా చేబ్రోలు వసంతరావు పేరును పార్టీ అధిష్టానం ప్రకటించారు. మంగళవారం వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా చేబ్రోలు వసంతరావు మాట్లాడుతూ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన శాయశక్తుల పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే తనకు పదవి వచ్చేందుకు సహకరించిన వింజమూరు మండల తెలుగుదేశం పార్టీ నేతలు ముఖ్యంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు తాను రుణపడి ఉంటానని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ చంచలమైన విశ్వాసంతో పని చేసి పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జిగా ఎన్నికైన వసంతరావుకు మండల నేతలు అభినందనలు తెలిపారు.

## అనుమతులకు మించి నిర్మాణాలు తొలగింపు



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 11, ప్రభా తవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు స్థానిక 39 వ వార్డు ఇరుగాలమ్మ దేవస్థానం సమీపంలో పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులను అతిక్రమించి నిర్మిస్తున్న భవనంలోని రెండవ అంతస్తు నిర్మాణాన్ని సిబ్బంది మంగళవారం తొలగించారు. 45 వ డివిజన్ నక్కలోళ్ళ సెంటర్ ప్రాంతాల్లో అనుమతులను ఉల్లంఘించి నిర్మిస్తున్న భవనం రెండవ అంతస్తు సెంట్రింగ్ తొలగించారు. అదేవిధంగా 31 వ డివిజన్ ప్రాంతంలో రోడ్డు ఆక్రమణలను తొలగించారు.

## సమిష్టి సహకారంతో ఆర్టీసీ బస్టాండుల్లో పారిశుద్యం మెరుగు



**నెల్లూరు, నవంబర్ 11, ప్రభాతవార్త-విద్య :** నెల్లూరు జోనల్ పరిధిలోని అన్నీ ఆర్టీసీ బస్టాండుల్లో పారిశుద్యం మెరుగుపడాలంటే ప్రజలు, సంస్ద ఉద్యోగులు, అధికారులు అందరి సమిష్టి సహకారం అవసరమి ఆర్టీసీ జోనల్ కమిటి చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని స్ధానిక ఆర్టీసీ2డిపో (పొట్ట శ్రీరాములు బస్టాండు)లో భగవాన్ మహావీర్‌జైన్ ట్రస్ట్ సౌజన్యంతో బస్టాండులోని స్టాల్స్ నిర్వాహకులకు చెత్త డబ్బాలు, కార్మికులకు రెయిన్ కోట్స్‌ను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని పంపిణీ చేవారు.ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతు బస్టాండుల్లో దుకాణదారులు, చెత్తను బుట్లలోనే వెయ్యాలనికోరారు, ప్రయాణీకులు కూడా పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సంస్ద ఆర్ఎం ఎస్‌కే.షమీమ్, 2 డిపో మేనేజర్ షేక్. కరిముస్నీసా, సిఐ శ్రీధర్, ట్రస్టు కార్యదర్శి జేపి జైన్, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఆంగ్ల సదస్సుకు పాటూరు ఉపాధ్యాయిని



**కోవూరు, నవంబర్ 11 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న జాలాది కేశవర్ధిని అంతర్జాతీయ ఆంగ్ల సదస్సుకు ఎంపికయ్యారు. ఈ నెల 12వ తేది నుంచి నాలుగు రోజుల పాటు బెంగుళూరులోని క్రిస్టియన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ ఆంగ్ల సదస్సులో ఆమె పాల్గొంటున్నారు. ఈ సదస్సులో ఆంగ్ల బోధనలో మెళుకువలు, నూతన పోకడల గురించి నాలుగు రోజుల పాటు శిక్షణ పొందనున్నారు. ఈ సదస్సులో జాతీయ , అంతర్జాతీయ ఆంగ్ల బోధకులచే పలు వినూత్న కార్యక్రమాలు కూడా నిర్వహించడం జరుగుతాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ జుల్ఫికర్ ఆలీ మాట్లాడుతూ తమ పాఠశాల ఉపాధ్యాయిని అంతర్జాతీయ ఆంగ్ల సదస్సుకు ఎంపిక కావడం తమ పాఠశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారన్నారు. ఈ సందర్భంగా ఆమెను బొకేతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమోహన్, శేషయ్య, కృష్ణమోహన్, వల్లీ బాషా, ఉమా మహేశ్వరి, అరుణ, విజయకుమారి, తదితరులు ఉన్నారు.

## రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి



**కోవూరు, నవంబర్ 11 ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు వేగూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం నారుమడులు చేస్తున్న రైతులకు వ్యవసాయ విస్తరణాధికారి షేక్. ఆసిమా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజనిని విత్తనం చల్లే ముందు ఒక కిలో విత్తిన 14 రోజుల తర్వాత ఒక కిలోను వాడాలన్నారు. ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్‌ను దుక్కిలో వేయాలని సూచించారు. ఒక వేళ జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారి చేయాలన్నారు. యూరియా కావాల్సిన రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి యూరియా కార్డులను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కీర్తన, శిరీష, మౌనిక, గ్రామ సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

## హోమియో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి




**కోవూరు, నవంబర్ 11 ప్రభాతవార్త :** ప్రస్తుత సీజన్‌లో వివిధ రోగాలతో బాధ పడే వారు తప్పనిసరిగా హోమియో వైద్య సేవలను పొందాలని ఇనమడుగు హోమియో వైద్యులు డాక్టర్ కరుణాకర్ తెలిపారు. కోవూరు మండలం చండు గుంట గ్రామంలో ఇనమడుగు ప్రభుత్వ కళాశాలకు సంబంధించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు పారిశుధ్యం, తదితర అంశాలపై ప్రత్యేక క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రకాల రోగాలను నయం చేసే మందులు హోమియోలో ఉన్నాయని, వీటిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఆయుష్ శాఖ సహకారంతో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇనమడుగు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా వుండాలి

### ..లావాదేవిలలో లేని ఖాతలలో నగదు పోందండి



**రాపూరు,నవంబరు11ప్రభాతవార్త :** బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా వుండాలని స్టేట్ బ్యాంకు ఆప్ ఇండియా చీఫ్ మేనెజర్ రిజనల్ బిజినేస్ మేనేజర్ (గూడూరు) విజయ్ కుమార్, కోరారు. మంగళవారం రాపూరులోని స్టేట్ బ్యాంకు ఆప్ ఇండియాలో కస్టమర్ రిలేషన్ కార్యక్రమాన్ని ఆయన స్ధానిక బ్యాంకు మేనేజర్ మధుభాబుతో కలసి నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ మోసగాళ్ళు అనేక మార్గాల ద్వారా ఖాతాలలోని నగదును దోచివేస్తున్నారని తెలిపారు. బ్యాంకు నుండి పోన్ చేస్తున్నామని, ఓటిపి చెప్పమని చెప్పడం, డెబిట్ కార్డు కాలం అయిపోయిందని, తిరిగి దానిని పునరుద్దరించాలని పోన్‌లు చేస్తుంటారని తెలిపారు. బ్యాంకు నుండి ఖాతాదారునికి పోన్ వచ్చినట్లుగా పోన్ వస్తే సమీపంలోని బ్యాంకుకు వెల్లి ధృవికరించుకోవాలన్నారు. ఒకవేల ఎప్పుడైన బ్యాంకు ఖాతాలలో నుండి నగదు డ్రా అయినట్లు గుర్తిస్తే వెంటనే సమాచారాన్ని 1930 కి పోన్ చేసి పిర్యాదు చేయాలన్నారు. అలాగే సమీపంలోని బ్యాంకు వెల్లి విషయం తెలపాలన్నారు. అలాగే 10 సంవత్సరాలకు పైగా లావాదేవిలు లేకుండా అగి వున్న ఖాతాలలో వున్న నగదును బ్యాంకుకు వెల్లి ఈకెవైసి చేయించుకోని తగిన పత్రాలు సమర్పించి తీసుకోవాలన్నారు. ఒక వేళ సంబందింత ఖాతాదారుడు మరణించి వుంటే మరణదృవీకరణ పత్రం, లీగల్ హైర్ సర్టిఫికేట్లతో నామినీదారులు బ్యాంకును సంప్రదించాలని కోరారు. వ్యక్తిగత ఖాతాలలో పెద్ద ఎత్తున ఈ మొత్తం వుందని ఎవరికైనా ఇటువంటి ఖాతాలు వుంటే వెంటనే నగదు పోందే అవకాశం వుందని తెలిపారు. ఈ సందర్బంగా ఆయన పలువురు బ్యాంకు ఖాతాదారులను సత్కరించారు. ఈయన వెంట పలువురు బ్యాంకు సిబ్బంది వున్నారు.

## ఉపాధ్యాయుల క్రీడా పోటీలు త్వరలో



**తోటపల్లి గూడూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధ్యా యులలో ఆరోగ్యం, శారీరక దృఢత్వం, నాయ కత్వ లక్షణాలను పెంపొందించేందుకు రాష్ట్రవ్యా ప్తంగా క్రీడా పోటీలు నిర్వహించనుంది. మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో జరిగే ఈ పోటీలు అనం తరం రాష్ట్ర స్థాయిలో కూడా కొనసాగ నున్నా యి.ఈ నేపథ్యంలో తోటపల్లి గూడూరు మండల ంలోని ఎంఈఓ కార్యాలయంలో బుధ వారం సమావేశం మండల విద్యాశాఖ అధికారి 2 డి. జయరామనాయుడు అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయ క్రీడాకారుల నుండి పేర్లు నమోదు చేశారు.ఈ పోటీలలో పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్ క్రీడలు నిర్వహి ంచనున్నారు. మండల స్థాయి జట్టు ఎంపిక కార్యక్రమం ఈ నెల 15న మధ్యాహ్నం చిన్న చెరుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగనుందని తెలియజేశారు.

## టిడిపి ఆరోపణలను ఖండించిన వైకాపా నేతలు



**తోటపల్లి గూడూరు, నవంబర్ 11 ప్రభాతవార్త :**మండలంలో ని తోటపల్లి పంచాయతీ డక్కిలివారి పాలెంలో మంగళవారం వైఎస్ఆర్సిపి నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల సోమ వారం టిడిపి నేతలు సీనయ్య ఇంటి తొలగింపు అంశంపై చేసిన అసత్య ఆరోపణలను వైకాపా నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ తోటపల్లి రామాచార్యులు, వైకాపా నాయకులు రాజేష్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ టిడిపి నేతలు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి. సంఘటన స్థలానికి రాకుండా ఊరి బయట పత్రికా సమావేశాలు పెట్టడం దురదృష్టకరం” అన్నారు. వారు తెలిపారు డక్కిలివారి పాలెం గ్రామ విస్తీర్ణం 1098 సర్వే నెంబర్‌లో 5 ఎకరాలు 95 సెంట్లు ఉంది. జిల్లా సర్వేయర్ ద్వారా మొత్తం విస్తీర్ణం కొలిపి, 0.40 సెంట్లు ఎక్కడ ఉందో చూపించగలిగితే మేము స్వాగతిస్తాం. ఇరువురికీ న్యాయం జరిగేలా చూస్తాం” అని అన్నారు.అలాగే సర్వే నెంబర్‌లను తారుమారు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని టిడిపి అధినేతకు నిజమైన వివరాలతో తెలియజేయడం మంచిదని సూచించారు. అవాస్తవాలు మాట్లాడటం సరైంది కాదు” అని వైకాపా నేతలు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ఉప్పల శంకరయ్య గౌడ్, సర్పంచ్ ఈదూరు రామాచార్యులు, బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శానిటేషన్ కార్యదర్శి మృతి

### - ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి వెళ్లిన చూసిన కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 11,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 1/4 ద్వారకా నగర్ 2 వార్డు సచివాలయంలో వార్డ్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న షేక్ ముజాహిద్ అలీ స్థానిక ఎన్టీఆర్ నగర్ హైవే ప్రాంతంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెం దారు. ప్రభుత్వ సర్వజన ప్రధాన వైద్యశాల మార్చురీ గదికి కమిషనర్ వై.ఓ నందన్ ఇతర అధికారులతో కలిసి తరలివెళ్లారు.

## వీఆర్ ఎంసీహెచ్ స్కూల్‌కు రూ.1.20 కోటి విలువైన 4 బస్సులు బహుకరణ

- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అభివృద్ధి బాటలో నడుస్తున్నామని తెలిపిన యూనియన్ బ్యాంకు వారు
- నెల్లూరు వీఆర్ఎంసీ హైస్కూల్లో జెండా ఊపి బస్సులను ప్రారంభించిన మున్సిపల్ కమీషనర్ నందన్



**నెల్లూరు, నవంబర్ 11 ,ప్రభాతవార్త –వైద్యం** నెల్లూరు నగరంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చేస్తున్న అభివృద్ధిని చూసి ఎంతో మంది దాతలు ఫిదా అవుతూ ముందుకు వస్తున్నారు. నిరంతర శ్రామికుడు.. అభివృద్ధిలో ఎక్కడ కూడా రాజీ పడని నేత మంత్రి నారాయణ అని వారు కొనియాడుతున్నారు. అభివృద్ధిలో తమ వంతు సహకారం అంటూ పలువురు ముందుకొచ్చి పలు రకాల సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. అందులో భాగంగా నెల్లూరులో పేద నిరుపేద విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీతో విద్యను అందించేందుకు అధునాతన సదుపాయాలతో తీర్చిదిద్దిన వీఆర్ ఎంసీ హైస్కూల్ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సూచనల మేరకు యూనియన్ బ్యాంకు వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల వినియోగంలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థకు ఒక కోటి 20 లక్షల విలువైన నాలుగు స్కూల్ బస్సులను బహుకరించారు. స్థానిక వీఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో మంగళవారం స్కూల్ బస్సుల ప్రారంభోత్సవం చేపట్టారు. నెల్లూరు నగర పాలక సంస్థ కమీషనర్ వై.ఓ నందన్ హాజరై జెండా ఊపి స్కూల్ బస్సులను ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ ఆలోచనల మేరకు అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నెల్లూరు నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కి ఎంపికైన శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు



**బుచ్చి నవంబర్ 11 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం శ్రీ వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ఈనెలలో నెల్లూరులో ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన అండర్ 14 స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ సెలక్షన్‌లో పాల్గొని ఆర్ టాన్సీ, ఎం జసికారాణి 20వ తేది కడపలో జరగబోయే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ క బాడీ పోటీలకు ఎంపికైయ్యారు. అలాగే అండ్ 17 స్కూల్ గేమ్స్ అబ్బాయిలు షేక్ జాకీర్ అలీ, ఈనెల 24న పశ్చిమగోదావరి జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైయ్యారు. ఈ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఏ.రామసుబ్బారెడ్డి అభినందించారు. అలాగే పిఇటి యశ్వంత్‌ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రామ సుబ్బారెడ్డి మాట్లాడుతు తమ పాఠశాలకు జాకీర్ ఆలీ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. తమ పాఠశాలలో క్రీడాలకు ప్రత్యేక సమయాన్ని కేటాయి స్తున్నట్లు ఆయన పేర్కున్నారు. భవిష్యత్తులో తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## జెడ్పీలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 11, ప్రభాతవార్త** మంగళవారం నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర ప టానికి జెడ్పీ సీఈఓ ఎల్ శ్రీధర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పరిపాలన అధికారులు జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

## సంయుక్తసేవా సంస్థ సేవలను అభినందించిన ఆర్డీవో

**కావలి, నవంబర్11, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పీ4 కార్యక్రమం కింద దత్తత తీసుకున్న 24 బంగారు కుటుంబాలకు సంయుక్త సేవా సంస్థ సభ్యులు నిత్యావసర వస్తువులు, బియ్యం,కూరగాయలు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ సేవలను కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, కావలి ఎంపీడీవో చేవూరు శ్రీదేవి లు అభినందించడం జరిగింది. కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ, ఎంపీడీవో సీహెచ్.శ్రీదేవి ముఖ్య అతిథులుగా హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బెజవాడ రవి కుమార్, వారి కుటుంబ సభ్యుల సహకారంతో 14 మంది నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య నిమిత్తం ఆర్డీవో వంశీకృష్ణ, ఎంపీడీవో శ్రీదేవి చేతుల మీదుగా రూ.1,44,000 అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎం.సన్నీ వంశీ కృష్ణ, ఎంపీడీవో సీహెచ్. శ్రీదేవిని సంయుక్త సేవా సంస్థ సభ్యులు సత్కరించడం జరిగింది. నియోజకవర్గంలో పీ4 కార్యక్రమం విజయవంతం కావడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్న సంయుక్త సేవా సంస్థ సభ్యులను ప్రశంసించడం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా సంయుక్త సేవా సంస్థకు సహాయ సహకారాలు అందిస్తూ, సంస్థను ముందుకు నడిపించడమే కాకుండా, పీ4 కార్యక్రమానికి మరింత తోడ్పాటు అందిస్తున్న దాతలను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.సురేంద్రను ఆర్డీవో సన్నీ వంశీ కృష్ణ, ఎంపీడీవో శ్రీదేవి అభినందించి, వారిని ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పి4 కోఆర్డినేటర్ గుండె మడుగుల సత్యానందం, సివిపియు యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి





**కోవూరు, నవంబర్ 11 ప్రభాతవార్త** :గ్రామ పంచాయతీల్లో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన పాత్ర పంచాయతీ కార్యదర్శులదే అని డీఎల్‌పీవో డాక్టర్ కె. రమణయ్య అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నుండి సంపద కేంద్రంలో మంగళవారం ఉమ్మడి జిల్లా పరిధిలోని ఒక్కొక్క మండలం నుంచి ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెత్త నుండి సంపద కేంద్రం ద్వారా రైతులకు ఉపయోగపడే ఎరువులను తయారు చేసుకుని తద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల నుంచి గ్రీన్ అంబాసిడర్లు చెత్తను సేకరించే సమయంలో తడి చెత్త పొడి చెత్త రూపంలో వేరువేరుగా తీసుకోవాలన్నారు. ఐవీఆర్ఎస్ సర్వేను ఉదయం 7 గంటల కల్లా ప్రారంభం అవుతుందని, పంచాయతీల్లో చెత్త సేకరణ ఎలా జరుగుతుంది అనే విషయాలను పరిశీలించాలన్నారు. చెత్త నుండి సంపద కేంద్రాల పరిసరాలు ఒక ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో చెత్తను తీసుకునేందుకు ఒక రథాన్ని ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులు తగు చొరవ తీసుకోవాలన్నారు. డీఎల్‌డీవో వాణి మాట్లాడుతూ ఒక ప్రణాళికాబద్ధంగా ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ప్రజల్లో పంచాయతీ మనది మన కోసం ఉన్నది అనే భావన కలిగించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రతి పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక దృష్టి పెడితే గ్రామాలు స్వచ్ఛగ్రామాలుగా మారుతాయన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీహరిరెడ్డి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుండి సంపద కేంద్రాల్లో ఎరువు ఏ విధంగా తయారవుతుంది అనే విషయాలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ డి. ప్రమీలమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొల్లా సునీల్‌కుమార్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్‌లు శివకుమార్, జిలానీ బాషాలు పాల్గొన్నారు.

## సిల్వర్‌ఓక్స్‌పాఠశాలలో రోబోటిక్ ల్యాబ్ ప్రారంభం



**నెల్లూరు, నవంబర్ 11, ప్రభా తవార్త–విద్య** : నగరంలోని స్థానిక పార్థసారథి నగర్ శ్రీ సద్గురు సిల్వర్‌ఓక్స్ పాఠశాలలో మంగళవారం ఏఐ ప వర్డ్ రోబోటిక్స్ ల్యాబ్, ఆర్ట్ స్టూడియోని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో యూఎస్‌ఏ ప్రభుత్వ ట్రెజరీ కల్సటెంట్ హరినాథ్, ఆడిటర్ మన్మధరావులు పాల్గొని ల్యాబ్, స్టూడియోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిల్వర్‌ఓక్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు వెంకటాద్రి నాయుడు, షణ్ముఖాచారిలు మాట్లాడుతు విద్యార్థులకు చిన్నతనం నుండే శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉత్సాహం, ఆశక్తి కలిగించేందుకు జిల్లాలోనే మెట్ట మెదటి సారిగా తమ విద్యాసంస్థల్లో ఎంతో ఖర్చుతో కూడుకున్న రోబోటిక్ ల్యాబ్‌ను ప్రారంభించటం జరిగిందన్నారు. అలాగే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యవ , విభిన్న ప్రతిభ లు వెలికి తీసేందుకు ఆర్ట్ గ్యాలరీ ఉపకరిస్తుందన్నారు. ఈ ప్రారంబత్సోవ వేడుకలను విజయవంతం చేసేందుకు కృషిచేసిన అందరికి వారు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిధులకు పాఠశాలల డైరెక్టర్లు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌రావు, అధ్యాపకులు, అద్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సేవామూర్తి విజయలక్ష్మీ



**తోటపల్లి గూడూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:** మండలంలోని వరిగొండ పంచాయతీ సీనియర్ వైకాపా నాయకులు గూడూరు విష్ణుమోహన్ రెడ్డి తల్లి శ్రీమతి గూడూరు విజయలక్ష్మీ (కీ.శే. గూడూరు రంగారెడ్డి సతీమణి) నవంబర్ 1వ తేదీ శనివారం మధ్యాహ్నం 1 గంటలకు స్వర్గస్థులైనారు. వారి ఉత్తరక్రియలు నవంబర్ 12వ తేదీ బుధవారం సాయంత్రం 7 గంటలకు, అలాగే బ్రాహ్మణ బియ్యాలు, పెద్దకర్మ నవంబర్ 13వ తేదీ గురువారం ధనలక్ష్మీపురంలోని కె.జి.కె. కళ్యాణ మండపం ఎదురుగా గల స్వగృహములో జరుగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గూడూరు విజయలక్ష్మి జీవితాంతం సేవా భావంతో జీవించిన సతీశయురాలు. పేదవారికి ఆహారం పంపిణీ చేయడం, వృద్ధులకు సహాయం అందించడం, దేవాలయ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించడం, గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకోవ డం వంటి అనేక సేవా కార్యక్ర మాల్లో ఆమె ముందుండేవారు.

ఆమెకు ఒక్క కుమారుడు, కుమార్తె ఉన్నారు. పేదవారికి సహాయం చేయడంలోనూ, దానం చేయడంలోనూ, దైవభక్తిలోనూ ఈమె ఎప్పుడూ ముందు వరుసలో ఉండేవారు. ఆమె మరణం పట్ల వరిగొండ, తోటపల్లి గూడూరు పరిసర గ్రామాల ప్రజలు, స్నేహితులు, బంధుమిత్రులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రజలు ప్రార్థించారు.


### ఉత్తరక్రియలు



మా తల్లిగారైన
కీ॥శే॥ గూడూరు విజయలక్ష్మి గారు
(కీ॥శే॥ గూడూరు రంగారెడ్డి గారి సతీమణి)
తేది 01.11.2025 శనివారం
మ॥ 1 గం॥లకు స్వర్గస్థులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ గూడూరు విజయలక్ష్మి గారు
తేది 12-11-2025 బుధవారం సా॥ 7 గం॥లకు నిలుపు
తేది 13-11-2025 గురువారం బ్రాహ్మణబియ్యాలు, పెద్దకర్మ
ధనలక్ష్మీపురంలోని కె.జి.కె.కళ్యాణ మండపము ఎదురుగా గల
మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.
ఇట్లు : కుమారుడు - గూడూరు విష్ణుమోహన్ రెడ్డి


## కాలువ పనులను అడ్డుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగి

- లబోదిబోమంటున్న రైతులు- వేగూరులో ఇదీ సంగతి





**కోవూరు, నవంబర్ 11 ప్రభాతవార్త :** గత ఐదు సంవత్సరాలుగా ఈ పంట కాలువ పూడికతీతకు నోచుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు ఇరిగేషన్ అధికారుల చొరవతో సంవత్సరాల తరబడి పూడికతీతకు నోచుకోని పంట కాలువలు ప్రస్తుతం ఎమ్మెల్యే పుణ్యమా అంటూ పారుదల కాలువలుగా మారతున్నాయి. ఈ నేపథ్యంలో వేగూరు పంచాయతీలో పంటగుంట కాలువ మీద సుమారు 100 ఎకరాలకు పైగా రైతులు ఆధారపడి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కాలువ పనులకు రైతులు పూడికతీత చేసేందుకు శ్రీకారం చుట్టారు. అయితే ఆ ప్రాంతంలో పొలాలు కొనుగోలు చేసిన ఓ ప్రభుత్వ ఉద్యోగి పంట గుంట కాలువ పూడికతీత పనులు అర్థాంతంగా ఆపివేసేలా చర్యలు చేపట్టారు. జేసీబీ పనులు చేస్తున్న వారిని బెదిరించి మీ మీద కోర్టు కేసులు పెడతామని చెప్పడంతో వారు పనులు చేయకుండా ఆపివేశారు. ఇటువంటి పరిస్థితుల్లో మంగళవారం ఈ కాలువపై ఆధారపడి సాగు చేసిన రైతులు మాట్లాడుతూ గత 90 సంవత్సరాలుగా ఈ కాలువ పారుదల ఉందని, గతంలో ఈ కాలువ కింద 100కు పైగా ఎకరాలు సాగుబడిలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వ ఉద్యోగి ఒక రైతు నుంచి పొలాలను గతంలో కొనుగోలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వేగూరు కాలువ మీద ప్రహరీ గోడ నిర్మించి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీనికి తోడు వేగూరు కాలువలో నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్ అధికారి అనుమతి లేకుండా పైపులు వేసి ఆ నీటిని తమ పంట పొలాలకు అక్రమంగా వాడుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ ఉద్యోగికి పొలం అమ్మిన వ్యక్తి వచ్చి తాను పొలం మాత్రమే అమ్మానని, కాలువ అమ్మలేదని చెప్పినా అతను మాత్రం ససేమీరా అనడం గమనార్హం. ఇప్పటికైనా ఈ పంట గుంట కాలువ విషయంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇరిగేషన్ అధికారులు చొరవ తీసుకుని తమ సమస్యకు ఒక మార్గం చూపాలని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఈ ప్రభుత్వ ఉద్యోగి నిబంధనలకు విరుద్ధంగా శివాయి ప్రాంతంలో అక్రమంగా ప్రహరీగోడ నిర్మించినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు పరిశీలిస్తే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. రైతులు శ్రీనివాసులు, సీహెచ్ పెంచలయ్య, సుమన్, తదితరులు ఉన్నారు.

## అటు కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారోత్సవాలు ఇటు వైసీపీ నిరసన కార్యక్రమాలు- సందిగ్ధంలో పోలీసులు





**కోవూరు, నవంబర్ 11 ప్రభాతవార్త** :కోవూరు నియోజకవర్గానికి మండల కేంద్రం అయిన కోవూరులో అటు కూటమి ప్రభుత్వం ఇటు ప్రతిపక్ష వైసీపీ పార్టీలు ఒకే రోజు ఒకే సమయంలో ఇరు పార్టీలు కార్యక్రమాలకు తెర తీశారు. ప్రతిపక్ష వైసీపీ పార్టీ గత నెలలోనే మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు సంబంధించి 28వ తేది రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టాలని సూచనలిచ్చింది. అయితే మొంథా తు పాన్ కారణంగా గత నెల 28న జరగాల్సిన నిరసన కార్యక్రమాన్ని నవంబర్ 12కి వాయిదా వేసుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం భారీ స్థాయిలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టాలని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు గత రెండు రోజులుగా నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో వరుస సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా దృష్టి పెట్టాలని సూచనలిచ్చారు. తొలిసారిగా ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో దీనిని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని వైసీపీ నేతలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. స్థానిక బజార్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి తాలూకా ఆఫీస్‌లోని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వాలని వైసీపీ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక రుక్మిణీ కళ్యాణ మండపంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక సమావేశం ప్రమాణ స్వీకారం కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. కోవూరు నియోజకవర్గ స్థాయిలో మండల, క్లస్టర్, యూనిట్; బూత్, టౌన్ గ్రామ కమిటీల చేత ప్రమాణ స్వీకారం పెద్ద ఎత్తున చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒకవైపు వైసీపీ, మరోవైపు టీడీపీ కార్యక్రమాలు ఒకే సమయం, ఒకే రోజు నిర్వహిస్తుండడం పట్ల పోలీస్ శాఖ తల పట్టుకుంటోంది. ఎక్కడ ఏచిన్న సమస్య అయినా శాఖకు ఇబ్బంది వస్తుందనే దోలాయమానంలో పోలీసులు ఉన్నారు. మొత్తం మీద బుధవారం కోవూరు పట్టణంలో ఒక టెన్షన్ వాతావరణం ఏర్పడుతుందని పార్టీల పరిశీలకులు భావిస్తున్నారు.

## డిప్యూటీ ఎంపీడీవోగా కే.లక్ష్మినరసయ్య బాధ్యతలు



**తోటపల్లి గూడూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:** మండల డిప్యూటీ ఎంపీడీవోగా కే.లక్ష్మినరసయ్య బుదవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ శాఖలో చేసిన పునర్వ్యవస్థీకరణలో భాగంగా, గతంలో ఉన్న ఈవో (పీఆర్‌డీ) హోదాను డిప్యూటీ ఎంపీడీవోగా మార్చిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన, మండలంలోని అన్ని గ్రామపంచాయతీలను సక్రమంగా పర్యవేక్షిస్తానని. పంచాయతీ కార్యదర్శులు తమబాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించి, గ్రామస్థాయి ప్రజా అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని. పంచాయతీ రాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా పనిచేస్తాను” అనిఅన్నారు. బాపట్లమండలంలో గ్రేడ్‌వన్ పంచాయతీ కార్యదర్శిగా సమర్థవంతంగా పనిచేసిన ఆయనకు పదోన్నతితో తోటపల్లి గూడూరు మండలానికి బదిలీ చేయడం జరిగిందని తెలిపారు. కే.లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రతిష్టాత్మకంగా పనిచేస్తాను” అని తెలిపారు.

## మున్సిపల్ కమిషనర్ ని సత్కరించిన వివిధ స్వచ్ఛంద సమస్థలు

**కావలి, నవంబర్ 11, ప్రభాతవార్త:** మొంథా తుఫాన్ కారణంగా ప్రజలకు విశేష సేవలు అందించిన సందర్భంగా తుఫాన్ ఫైటర్ అవార్డును అందుకున్న కావలి మునిసిపల్ కమీషనర్ జి.శ్రావణ్ కుమార్ ని మంగళవారం వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు ఎస్.కె.బాష ఆధ్వర్యంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.కె భాష, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడారు మొంథా తుఫాన్ కారణంగా కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సూచనలు సలహాలతో కమిషనర్ శ్రావణ్ కుమార్ కావలి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు విశేష సేవలు అందించడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా తుఫాన్ ఫైటర్ అవార్డును అందుకున్నందున వారికి హృదయపూర్వక అభినందనలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



కోవూరు, నవంబర్ 11 ప్రభాతవార్త : కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో కార్తీక మంగళవారం పర్వదినం సందర్భంగా ప్రాతః కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూ జలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వ హించారు. రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్రస్వామి, భక్తులు ఉన్నారు.

## నారాయణలో 69 మూర్ఛ శస్త్ర చికిత్సలు విజయవంతం





**నెల్లూరు, నవంబర్ 11, ప్రభాతవార్త –వైద్యం** నారాయణ హాస్పిటల్‌లో మూర్ఛ వ్యాధి రోగుల కొరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక క్లినిక్ ద్వారా ఇప్పటి వరకు 69 మూర్ఛ శస్త్రతన చికిత్సలు విజయవంతం అయిన సందర్భంగా పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.హరీష్ మాట్లాడుతూ మూర్ఛ వ్యాధి గురించి ఇప్పటికి చాలా మందికి సరైన అవగాహన లేదని, జీవితాంతం మందులు మింగాల్సిందే అనే అపోహలో ఉన్నారని, అయితే మూర్ఛవ్యాధికి నూతన చికిత్సా పద్ధతులు, అధునాతన శస్త్ర చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి అని తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశంలో అతి కొద్ది చోట్ల మాత్రమే నిర్వహించే ఈ మూర్ఛ శస్త్ర చికిత్సలు మన రాష్ట్రంలో మొదటగా ఎక్కువ శాతం విజయవంతంగా నిర్వహించిన ఘనత నారాయణ హాస్పిటల్ న్యూరోసైన్సెస్ వైద్యులకే దక్కుతుందన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నారాయణ హాస్పిటల్ న్యూరాలజి విభాగాధిపతి డాక్టర్ ఎన్ఎస్ సంపత్ కుమార్ మాట్లాడుతూ మూర్ఛ శస్త్ర చికిత్సకు అవసరమైన అత్యంత అధునాతన పరికరాలు, వినూత్న చికిత్సా పద్ధతులు, న్యూరాలజి, న్యూరోసర్జరీ, అనస్థీషియా వైద్యుల సమిష్టి కృషితో ఈ శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ఎంతో ఖర్చుతో కూడుకున్న ఈ చికిత్సలను నారాయణ హాస్పిటల్ యాజమాన్యం, ప్రభుత్వ సహకారంతో ఇన్సూరెన్స్, ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన సుమారు 69 మంది రోగులకు ఇక్కడ విజయవంతంగా శస్త్ర చికిత్సలు జరిగాయని, దక్షిణ భారతదేశంలో కొద్ది సెంటర్లలో మాత్రమే జరిగే ఈ శస్త్ర చికిత్సలు రాష్ట్రంలో ఒక్క నారాయణలో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్‌ఏ సాయికిరణ్ మాట్లాడుతూ మూర్ఛ వ్యాధికి శస్త్ర చికిత్స సదుపాయం భారతదేశంలో కొద్ది చోట్ల మాత్రమే అందుబాటులో ఉందని, మూర్ఛ వ్యాధి నిర్ధారణ, శస్త్ర చికిత్సకు అవసరమైన అత్యంత అధునాతన పరికరాలు 32 ఛానెల్ వీడియో ఈఈజీ, 3 టెస్లా ఎమ్మారై, ఎలక్ట్రో కార్టికోగ్రాఫీ, డెప్త్ ఎలక్ట్రోడ్ రికార్డింగ్ సదుపాయం ఉన్న న్యూరో సైకాలజి కాల్ మానిటర్, 400 డబ్ల్యూ టీ ల్యాంప్ కలిగిన హై ఎండ్ ఆపరేటివ్ మైక్రో స్కోప్, న్యూరో నెగిటివ్ సిస్టమ్ నారాయణ హాస్పిటల్‌లో అందుబాటులో ఉండటం గర్వకారణమని తెలిపారు. ఇప్పటికి 69కి పైగా మూర్ఛ వ్యాధికి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. మూర్ఛ వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, న్యూరాలజిస్ట్ డాక్టర్ డీఆర్ అనూష, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ కృష్ణ చైతన్య, న్యూరో అనస్టిటిస్టులు డాక్టర్ అనిల్, డాక్టర్ బృంద, నారాయణ హాస్పిటల్ ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ తెలుగుదేశం నేతల్లో జోష్

- పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఎమ్మెల్యే



**వింజమూరు, నవంబర్ 11, ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబా బునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కమిటీ అధ్యక్షులు సూచనల మే రకు పండుగ వాతావరణంలో మండల గ్రా మ క్లస్టర్ బూత్ కమిటీల అధ్యక్ష, కార్య దర్శులు నియామక ప్రమాణ స్వీకార మహోత్సవం నేతలతో జోష్ నింపింది. మంగళవారం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పి.చంచల బాబు యాదవ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ఎల్‌సీ రమణారెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గంలోనే 8 మండలాల ముఖ్య నేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు నాయకులకు పార్టీలో సముచిత స్థానంకల్పించడంలో తెలుగుదేశం ముందుంటుందని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి బలమని వారే నిజమైన సైనికులని తెలిపారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరు పదవిని అలంకారప్రాయంగా చూడకుండా ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. నేటి నుండి మూడు రోజుల పాటు మండల క్లస్టర్ యూనిట్ గ్రామ బూత్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు పార్టీ సూచించిన నేతలు అఖండ విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నర్సా రెడ్డి, దుత్తలూరు మండల కన్వీనర్‌గా ఉండేల గురవారెడ్డి, వరికుంటపాడు మండల కన్వీనర్‌గా చంద్ర మధుసూదన్‌రావు, సీతారాంపురం కన్వీనర్‌గా చింతల శ్రీనివాసు లు, కొండాపురం కన్వీనర్‌గా పోలినేని చంద్రబాబునాయుడు, జలదంకి మండల కన్వీనర్‌గా మునగాల తిరు మలరెడ్డి, అలాగే మండల క్లస్టర్ ఇన్‌చార్జిలు ప్రధాన కార్యదర్శులు కో క్లస్టర్ ఇన్‌చార్జిలు ప్రమాణ స్వీకారాన్ని ఎమ్మెల్యే చేయించారు. 8 మండలాల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన జిల్లాస్థాయి సివిల్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపికలు



**నెల్లూరు, నవంబర్ 11, ప్రభాతవార్త–విద్య :** 19 నుండి 22 వరకు విజయవాడ, గుంటూరుల్లో నిర్వహించనున్న రాష్ట్రస్దాయి సివిల్ సర్వీస్ ఉ ద్యోగుల క్రీడాపోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడా జట్ల ఎంపికలు మంగళవారం నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడామైదానంలో ప్రారంభమై య్యాయి. తొలిరోజు ఉ ద్యోగులకు అథ్లెటిక్స్, బ్యా డ్మింటన్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, లాన్ టెన్నీస్ వంటి క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనప రిచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఈ పోటీల్లో జిల్లాలోని అనేక ప్రాంతాల నుండి ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఎంపికల్లో భాగంగా నేడు (బుధవారం) సిమ్మింగ్, ఖోఖో, టేబుల్ టెన్నీస్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్ ప్లే వంటి వాటిలో పోటీలు జరుగతున్నాయి.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి సంతాపం



**నెల్లూరు, నవంబర్ 11, ప్రభాతవార్త–విద్య :** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని ఎన్‌టిఆర్ నగర్ హైవేవద్ద లారీ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మరణించటం చాలా బాధాకరమని వైకాపా నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, తూర్పురాయలసీమ ఉ పాధ్యా య ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ప్రభాత వార్తతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో మరణించిన వారికి తమ నివాళులు అర్పిస్తున్నా మని, బాధితకుటుంబాలకు తమసంతాపాన్ని ప్రకటిస్తున్నామన్నారు. ప్రమాదంలోగా యపడిన 4వ్యక్తులు త్వరగాకోలుకోవాలని , ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్‌లో పున రావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధితులకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు.